క్లుప్తంగా

సమర్థవంతంగా టీకా కార్యక్రమం


టీకా కార్యక్రమంపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న జిల్లా టీకా అధికారి జగదీష్

పూసపాటిరేగ: టీకా కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా టీకా అధికారి డాక్టర్ జగదీష్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిల్వ ఉన్న వ్యాక్సిన్లు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలో టీకాలు వేసుకునే విధంగా హెల్త్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమియాలజిస్ట్ సూర్యతేజ, వైద్యాధికారి రాజేష్‌వర్మ, సీహెచ్‌ఓ వేదమణి, సిబ్బంది గణపతి, ఆర్‌పీ రమణ, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుణుపూరుపేటలో వైద్యశిబిరం


గుణుపూరుపేటలో రక్తదానం చేస్తున్న యువకులు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో రోగులు పాల్గొని వైద్యసేవలు పొందారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ఒక ఏడాది పాటు ఉచిత ప్రమాద బీమా చేయించామని విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల ముత్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామునాయుడు, ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, విజయ్, రఘు పాల్గొన్నారు.

అలరించిన ధర్మపథం


భజన బృంద కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఈఓ ప్రసాదరావు

నెల్లిమర్ల రూరల్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రామతీర్థం సీతారామ స్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన ధర్మపథం కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. సంతకవిటి మండలంలోని వాల్తేరు గ్రామానికి చెందిన విజయగణపతి భజన బృంద కళాకారులు స్వామి సన్నిధిలో పలు భక్తి గీతాలను ఆలపించారు. ఈఓ ప్రసాదరావు కళాకారులను అభినందించి దేవాదాయశాఖ తరుపున ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శివాలయ అర్చకుడు రేజేటి మల్లికార్జునశర్మ, కళాకారుల సంఘ అధ్యక్షుడు పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాలయ ప్రారంభోత్సవం


సీతారామాలయంలో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బాడంగి: మండలంలోని పినపెంకిలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామపెద్దల సమక్షంలో మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా మరియమాత పాప పరిహార పాదయాత్ర

బాడంగి: మండలంలోని కోడూరులో వెలిసిన మరియమాత పాపపరిహార పాదయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మరియమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు బైబిల్ సారాంశాన్ని వివరించారు. వేలాది మంది భక్తులు రావడంతో కోడూరు ప్రాంతం జనసంద్రమైంది.

బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం: బాలల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని బూసాయవలస కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం. దీప, మహిళా పోలీస్ ఆర్. లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ విజయమే లక్ష్యం..

- 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి
- ప్రతి ఓటర్‌ను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చే బాధ్యత మీదే
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- పోలింగ్ ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో విజయం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా కష్టించి పని చేయాలన్నారు. శనివారం తన నివాసంలో విజయనగరం నియోజకవర్గ పరిధిలోని మండల, నగర పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీతంరాజు సుధాకర్ గెలుపు ఎంతో కీలకమన్నారు. ఓటర్ల నమోదు విజయనగరం నియోజకవర్గం ముందంజలో ఉందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.ఆఖరు ఘట్టమైన పోలింగ్ ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి ఐదు పోలింగ్ స్టేషన్లలో 20 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ ప్రక్రియపై పరిజ్ఞానం గల ఏజెంట్లను నియమించాలని సూచించారు.

మే 1వ నుంచి వార్డు స్థాయిలో గృహసారథులతో సమావేశాలు..

మే 1వ తేదీ తర్వాత ప్రతి డివిజన్‌లో తాను పర్యటిస్తూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, మహిళ విభాగ సభ్యులు, పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తానని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. తల్లిలాంటి పార్టీ కోసం పార్టీ శ్రేణులు కొంత సమయం కేటాయించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. పదవులు శాశ్వతం కాదు.. పార్టీ ముఖ్యమన్న సంగతి ప్రతి ఒక్కరూ గమనించి పనిచేయాలని సూచించారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి మాట్లాడుతూ, ఎన్నికల ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, కంటుభుక్త తవిటిరాజు, రెడ్డి గురుమూర్తి, ముచ్చు శ్రీనివాసరావు, గుజ్జల నారాయణరావు, అల్లు చాణక్య, ఎవర్ణ కుమారస్వామి, కాళ్ల సూరిబాబు, తమ్ము, బాల బ్రహ్మారెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు


డ్రోన్ల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ప్రతినిధులు

డెంకాడ: డ్రోన్ టెక్నాలజీతో భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీనియర్ యూఏవీ ఇంజినీర్ అండ్ డీజీసీఏ సర్టిఫైడ్ ఆర్పీఏ ఇన్‌స్ట్రక్టర్ మామిడి శ్రీనివాస్ అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో డ్రోన్ టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ల తయారీ సంస్థ మారుత్ డ్రోన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరై మాట్లాడారు. డ్రోన్లలోని రకాలు, వాటి పనితీరును వివరించారు. వివిధ రకాల వ్యవసాయ, రక్షణ రంగాల్లో డ్రోన్ల సేవలను తెలియజేశారు. డ్రోన్ టెక్నాలజీ కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, నిర్వాహకులు ఎం.రాజన్‌బాబు, ఏవీ పరాంకుశం, శ్రీధర్, నరేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్


మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూట్–1 కింద వంగర, రేగిడి మండలాలు రూరల్ సీఐ పరిధిలోను, రూట్–2 రాజాం, సంతకవిటి మండలాలు టౌన్ సర్కిల్ పరిధిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల వరకు 144 సెక్షన్ ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత ఎన్నికకు అంతా సహకరించాలని కోరారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటు వేసేందుకు వెళ్లే వారు మొబైల్ తీసుకుని వెళ్లకూడదని సూచించారు. ఎన్నిక అనంతరం బాలెట్ బాక్స్‌లను విజయనగరం రిసెప్షన్ సెంటర్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎస్సై వై.రవికిరణ్ ఉన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన అవనాపు


మజ్జి శ్రీనివాసరావును సత్కరిస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన అవనాపు విక్రమ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. మూడు జిల్లాల యూత్ వింగ్ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి, పార్టీ పెద్దలకు అవనాపు విక్రమ్ ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అవనాపు విక్రమ్‌ను శ్రీనివాసరావు సూచించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థికే మద్దతు

- వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్


హనుమంతు లజపతిరాయ్

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ తమ మద్దతని జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఫర్ ఆంధ్రప్రదేశ్ పరిపాలనా వికేంద్రీకరణ మద్దతు తెలిపింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్టణాన్ని రాజధానిగా వద్దని ప్రచారం చేసే అన్ని రాజకీయ పార్టీల ఆలోచన విధానానికి మూడు రాజధానుల ఐక్య కార్యాచరణ కమిటీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ విశాఖపట్టణాన్ని రాజధానిగా ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కే ఓటు వేస్తామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ సంబరాలు మిన్నంటాలి..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రంలో సంబరాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పట్టణ, మండల వార్డు స్థాయి నాయకులతో మండల కేంద్రంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 9.30 గంటలకు బొబ్బిలి పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు చెప్పారు. అలాగే మండల కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సీతంరాజు గెలుపునకు పనిచేయాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు రేజేటి ఈశ్వరరావు (విను), తమ్మిరెడ్డి దామోదరరావులతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులతో సమావేశమయ్యారు. సీతంరాజు గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు శ్రీనివాసరావు, పార్వతి, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సంస్థల్లో ఖాళీలు ఏర్పడిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణకు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో అధికారులు ప్రదర్శించారు. సర్పంచ్ స్థానాలకు ఓనెఅగ్రహారం, లక్ష్మీపేట పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వార్డుమెంబర్లు కొప్పరవలస, రుషింగి, కొట్టిశ, ఇరువాడ గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సి ఉందని ఈఓపీఆర్డీ లోపింటి త్రినాధులు తెలిపారు.

సీతంరాజుకే మొదటి ప్రాధాన్యతా ఓటు

- ప్రచారంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో నవ వరుడుకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు


విజయనగరం: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్, తదితరులు


నెల్లిమర్ల రూరల్: పారసాంలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్లు, జెడ్పీటీసీ సభ్యుడు గదల, తదితరులు


నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న చిక్కాల, తదితరులు


విజయనగరం టౌన్: ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న శంకరరెడ్డి, తదితరులు

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పిలుపునిచ్చారు. నగరంలోని రాజీవ్ స్టేడియం, తదితర ప్రాంతాలలో శనివారం వారు పర్యటించి వాకర్లు, క్రీడాకారులు, కోచ్‌లను కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పాలన చూసి సీతంరాజుకు ఓటెయ్యాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్ స్టేడియం ప్రారంభించారని, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి క్రీడాకారులకు సకల సదుపాయాలు కల్పించారని సూచించారు. ప్రచార కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, పైడితల్లి అమ్మవారి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఎంకేబీ, ఆర్కే యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో..

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గ్రామాల్లో ముమ్మరంగా సాగింది. ప్రచారానికి చివరి రోజు కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. ఒమ్మిలో సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు ప్రచారం చేయగా.. పారసాంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు వైకుంఠం, సత్యనారాయణ, తదితరులు సీతంరాజుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

సీతంరాజును గెలిపించండి..

భోగాపురం: బ్యాలెట్ పేపర్‌లో మూడో స్థానంలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కోరారు. మండలంలోని పోలిపల్లి, గూడెపువలస, భోగాపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, వైస్ ఎంపీపీ దంతులూరి రాంబాబు, కర్రోతు వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, భాను ప్రకాష్, సుందర హరీష్, కొల్లు రామ్మూర్తి, పోతిరెండి గోపిరావు, పతివాడ రామకృష్ణ, కొండపు కొత్తయ్యరెడ్డి, కర్రోతు శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోషణరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు తెలపండి..

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, తదితరులు పట్టణంలో ప్రచారం నిర్వహించి, సుధాకర్‌కు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మైపాడ ప్రసాద్, రవ్వ నాగేంద్రవర్మ, పైల మురళి, బూర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో ప్రచారం..

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పట్టభద్రులందరూ వైఎస్సార్‌సీపీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి కోరారు. నగరంలోని 40వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కొయ్యాన రమేష్, తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం: పోలిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు